క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



మహమ్మదాబాద్: గ్రామపంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం మండలపరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులకు, అధికారులకు అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ , ఆర్‌ఐ యాదయ్యలకు వినతి పత్రాలు అందజేశారు. తమను పర్మినెంట్ చేయాలని, తగిన వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరం మేరకు కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. జీవో 51ని రద్దు చేయాలని కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని అన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి



నవాబుపేట: హైదరాబాద్‌లో వచ్చే నెల 4న నిర్వహించే వీరశైవ లింగాయత్ మహార్యాలీని విజయవంతం చేయాలని సమాజం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్‌లు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివకుమార్, సిద్దిలింగం, చంద్రశేఖర్, నాగేశ్వర్, వినోద్, గిరిజ, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతువేదికల్లో చలివేంద్రాల ఏర్పాటు



బాలానగర్: పెద్దాయపల్లి, మొదంపల్లి గ్రామ రైతువేదికల వద్ద బాలానగర్ మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ రజిని చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. తన భర్త జగన్ నాయక్ సూచనతో సొంత ఖర్చులతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు బోయ శ్రీశైలం, మనోహర్ రెడ్డి, కృష్ణయ్య గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటాలి



గండీడ్: గ్రామీణ క్రీడాకారులు పోటీల్లో రాణించాలని వైఎస్సార్‌టీపీ పరిగి ఇన్‌చార్జ్ గౌస్, గండీడ్ మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం పెద్దవార్వాల్‌లో వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్–7 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గ్రామాల్లోని విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పీపీఎల్ ఇన్‌చార్జ్ వెంకటేష్ గౌడ్, అధ్యక్షుడు ప్రశాంత్, వీరన్న, యాదిలాల్, ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీను, మొగులయ్య ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మహబూబ్‌నగర్ క్రైం: కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు, నేరాలు కట్టడి చేసే అవకాశం ఉందని టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. న్యూ ప్రేమ్‌నగర్‌లో సోమవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం 30మంది పోలీస్ సిబ్బంది కాలనీలో ఉన్న ఇళ్లు తనిఖీ చేస్తూ ఆయా ఇళ్లలో నివాసం ఉండే వారి వివరాలు ఆరా తీశారు. ఈ క్రమంలో సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చౌరస్తాలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు బాగా పెరిగాయన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనవసరమైన మెసేజ్‌లు, లింక్‌లు క్లిక్ చేయరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు.

ప్రణాళిక బద్ధంగా ఉత్సవాలు



వీసీలో పాల్గొన్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, నారాయణ పేట జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఇతర అధికారులు

- జిల్లా కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రవినాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైదరాబాద్ నుంచి సోమవారం ఉత్సవాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు నోడల్ అధికారుల టీంను ఏర్పాటు చేశామన్నారు. ఆయా రోజుల్లో అందరూ ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తామన్నారు. అదేవిధంగా జిల్లాలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. జులై 14న పంపిణీ అనంతరం తెలంగాణ మెడికల్ కాలేజీ, పారా మెడికల్ కాలేజీ వారిని ఆహ్వానించి ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా నార్మల్ డెలివరీ బెస్ట్ దవాఖానాల గురించి వివరిస్తారని అన్నారు. మహిళా రిజర్వేషన్ ఉమెన్ సేఫ్టీ, అంగన్‌వాడీ టీచర్లు, బెస్ట్ టీచర్ల ఎంపిక, ఉత్తమ ఉద్యోగుల ఎంపిక, వారికి అవార్డుల ప్రదానం ఉంటాయన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారి ఉత్సవాలపై మాట్లాడారు. జూన్ 2 నుంచి 22 వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణ తదితర కార్యక్రమాలపై ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. జూన్ 8న ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ, భోజనాలు పకడ్బందీగా చేయాలని తెలిపారు. వేడుకలకు జిల్లాలో అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని ఎలాంటి పొరపాట్లు ఉండరాదని అన్నారు. విద్యుత్ రంగంలో ప్రగతిపై నాడు నేడు ఫ్లెక్సీలు, పోలీస్‌ల ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలని అన్నారు. జూన్ 9న రెండో విడత గొర్రెలు, అవకాశం ఉన్న చోట ఇంటిపట్టాల పంపిణీ, కులవృత్తుల ఆర్థికసాయం చేపట్టాలన్నారు. అదేవిధంగా నూతన జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలు తెలియజేయాలని, మహిళా దినోత్సవ వేడుకలు, వైద్య, ఆరోగ్య శాఖ ప్రగతి, కొత్త ఆస్పత్రుల ఏర్పాటు, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి సాధించిన విజయాలు ఘనంగా చాటాలన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానించాలని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ, గిరిజనోత్సవం, పచ్చదనం , విద్యాశాఖ, ఆధ్యాత్మిక రంగ ప్రగతి, అమరుల సంస్మరణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష, మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ, రెండు జిల్లాల అడిషనల్ కలెక్టర్లు సీతారామరావు, మయాంక్ మిట్టల్, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

దేవరకద్రరూరల్: పట్టణంలో మూసివేసిన రైల్వే గేట్‌ను తెరిపించాలని కోరుతూ సోమవారం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్వోబీ పనులు పూర్తయి అందుబాటులోకి రావడంతో రైల్వే అధికారులు గేట్‌ను మూసివేశారని వివరించారు. దీంతో వాహనదారులకు, పట్టణవాసులకు, వ్యాపారస్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. వెంటనే గేట్‌ను తెరిపించాలని కోరారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి

అడ్డాకుల: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు 2023 వానాకాలం రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ క్లస్టర్ విస్తరణ అధికారులకు పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జీరాక్స్ ప్రతులతో పాటు మొబైల్ ఫోన్ నంబర్‌ను ఇవ్వాలని సూచించారు.

రామలింగేశ్వరాలయం వద్ద అన్నదానం

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులు తమ సొంత డబ్బులతో కార్యక్రమం చేపట్టారు. ప్రతి సోమవారం జరిగే అన్నదాన కార్యక్రమానికి భక్తులు ముందుకు రావాలని ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ ఈ సందర్భంగా కోరారు. సర్పంచ్ శ్రీకాంత్, ఈఓ రాజేశ్వరశర్మ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్ యాదవ్, రాములు, చంద్రమౌళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని వర్నె గ్రామానికి చెందిన మహేందర్ కొన్నాళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయి ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. ఈ మేరకు బాధితుడిని సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెద్దమునుగల్‌చేడ్ సర్పంచ్ విజయలక్ష్మి, కోఆప్షన్ ఖాజాఘోరీ, చంద్రమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

6 లోగా జాయిన్ అవ్వండి

గండీడ్: మాడల్ స్కూల్‌లో సీటు వచ్చిన విద్యార్థులు 6వ తేదీ లోపు జాయిన్ కావాలని గండీడ్ వెన్నాచేడ్ ప్రిన్సిపాల్ కొండల్‌రావు తెలిపారు. మాడల్ స్కూల్ ఆరో తరగతికి వంద సీట్లు ఉన్నాయని ఏడు, ఎనిమిది, పదో తరగతుల్లో రెండు చొప్పున తొమ్మిదో తరగతిలో ఆరు సీట్లు ఉన్నాయని అన్నారు. విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలు తీసుకునిరావాలన్నారు.

రెండు ఆటోలు ఢీ : ఇద్దరికి గాయాలు

జడ్చర్ల: గంగాపూర్ గ్రామం వద్ద సోమవారం రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు వస్తున్న టాటా ఏస్ బండిని జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఆటో వేగంగా ఢీకొట్టింది. ఆటో డ్రైవర్‌కు, టాటాఏస్‌లో ప్రయాణిస్తున్న ఓ మహిళకు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో వారిని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో పాడిఆవు మృతి

రాజాపూర్: మండల పరిధిలోని రాఘవాపూర్‌లో సోమవారం గ్రామానికి చెందిన కటిక రాంచందర్ తన పశువులను మేపడానికి తీసుకెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురై ఓ పాడి ఆవు మృతి చెందింది. దీంతో తన జీవనాధారం పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఆదుకోవాలని కోరారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

మిడ్జిల్: పిడుగు పాటుకు ఎద్దు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వల్లభ్‌రావుపల్లి రైతు పల్లెమోని వెంకట్‌రాములుకు చెందిన ఎద్దు సోమవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద పిడుగుపాటుకు గురై మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

తెలంగాణ వచ్చాకే పల్లెల అభివృద్ధి



బాదేపల్లిలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు అర్హులను గుర్తిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ఉమ్మడి రాష్ట్రంలో సమస్యలతో సతమతమైన పల్లెలు తెలంగాణ వచ్చాకనే అభివృద్ధి చెందాయని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలో సోమవారం ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. నిమ్మబాయిగడ్డ ప్రాంతంలోని 18, 19వ వార్డుల్లో ఫజల్‌బండ, ఎర్ర సత్యం కాలనీలలో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులను గుర్తించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పైరవీలకు తావులేదన్నారు. వచ్చే నెలలో ఇళ్ల పంపిణీ ఉంటుందన్నారు. అనంతరం పద్మావతి కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును పరిశీలించారు. బస్సును దహనం చేసిన వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ లక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కమిషనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదిక ప్రారంభం

మండలపరిధిలోని ఆలూరు గ్రామంలో రైతు వేదికను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.28 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బొడ్రాయి పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆల్వాన్‌పల్లిలో రైతుబీమా లబ్ధిదారు రేణుకకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, సర్పంచ్‌లు సుకన్య, విజయలక్ష్మి, ఎంఈఓ మంజులాదేవి, ఏఓ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్‌పై కార్మికులకు అవగాహన

చిన్నచింతకుంట: వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారి రమేష్ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. సందర్భంగా మాట్లాడుతూ బీడీ కార్మికులతో పాటు ఇతరులకు ఏవైన కారణాల వల్ల పీఎఫ్ నిలిచి ఉంటే వాటిని సవరణ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, పేర్లు తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. అనంతరం కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధికారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి రమేష్

నూతన ఆస్పత్రికి రోగుల క్యూ



నూతన ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న వైద్యుడు

జడ్చర్ల టౌన్: పట్టణంలో నూతనంగా ప్రారంభించిన ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి మొదలైంది. ఓపీతో సహా అన్ని వైద్య సేవలను సోమవారం ప్రారంభించారు. పట్టణ శివారులో ఆస్పత్రి నిర్మించడంతో రోగులు వస్తారా లేదా అన్న సందేహాలు నెలకొన్న నేపథ్యంలో మొదటిరోజే 250 మందికి పైగా ఓపీ నమోదు కావటం గమనార్హం. ముఖ్యంగా పెద్ద ఆదిరాల, కోడ్గల్, కొండేడ్, లింగంపేట, గంగాపూర్, ఆల్వాన్‌పల్లి తదితర గ్రామాల నుంచి ఆస్పత్రికి తరలివచ్చారు. పట్టణంతోపాటు ఆస్పత్రికి ఇటువైపు ఉన్న గ్రామాల నుంచి తక్కువ సంఖ్యలో రోగులు వచ్చారు. కాగా పాతఆస్పత్రిలో తాత్కాలికంగా ఇద్దరు డాక్టర్లను అందుబాటులో ఉంచారు. అక్కడికి వచ్చిన రోగులను నూతన ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తుండటంతో ఆటోల ద్వారా చేరుకుంటున్నారు. కాగా తాము ఆశించిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో రోగులు మొదటిరోజు తరలి వచ్చారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. సోమశేఖర్ సాక్షికి తెలియజేశారు. వార్డు కౌన్సిలర్ సతీష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



పెదిరిపాడ్ చెరువు కట్ట వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మద్దూరు: మండల కేంద్రం నుంచి నారాయణపేట వెళ్లే రోడ్డులో పెదిరిపాడ్ చెరువు కట్ట దగ్గర ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ నిత్యం వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. పదేళ్ల కిందట ఆర్ అండ్‌బీ నిధులతో బీటీని నిర్మించారు. నారాయణపేటకు వెళ్లేందుకు తక్కువ దూరం కావడంతో వాహనదారులు ఈ దారి గుండా వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ రోడ్డుపై మూలమలుపులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడ ప్రమాద సూచికలు పెట్టకపోవడం, స్పీడ్ బ్రేక్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట ఒత్తుగుండ్ల గ్రామానికి చెందిన చాకలి రాములు మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి తీవ్రగాయాలపాలయ్యాడు. అలాగే చెన్వారెడ్డిపల్లికి చెందిన చెంద్రప్ప బైక్ వస్తూ అదుపుతప్పి గాయపడ్డాడు. అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టు దగ్గర ఇనుప కడ్డీలు, రోడ్డు మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫంక్షన్‌హాల్‌పై చర్యలు తీసుకోండి



బాలాజీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బాలాజీనగర్‌లోని అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కాలనీలో సోమవారం పర్యటించిన మంత్రికి స్థానికులు ఫంక్షన్‌హాల్ వెనుక భాగం నుంచి మురుగు బయటకు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఎక్కడికక్కడ మురుగు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయని, వాటి బారిన పడుతున్నామని వాపోవడంతో మంత్రి స్పందించారు. అదేవిధంగా కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.పది లక్షలు కేటాయిస్తున్నామన్నారు. అత్యవసరమున్న చోట్ల సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలన్నారు. అనంతరం వల్లభ్‌నగర్, గణేష్‌నగర్‌లో పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్ కుమార్, 11, 27వ వార్డు కౌన్సిలర్లు ఎన్.శ్రీనివాసులు, జి.సంధ్య, బాలాజీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు కృష్ణకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వేసవి శిబిరం

జడ్చర్ల టౌన్: సంస్కార్ ఎడ్యుకేట్స్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం మంగళవారంతో ముగియనుంది. శిబిరంలో 120 మంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, డాన్స్, డ్రాయింగ్, చక్కని చేతిరాత, గణితంలో మెలకువలు, రసాయనశాస్త్రంలో అవగాహన కల్పించేలా 30రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. కరోనా సమయంలో విద్యార్థులు బేసిక్స్ మర్చిపోయారని కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేయటంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు గడ్డం సందీప్ తెలియజేశారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే టోర్నీ లో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ విద్యార్థి ప్రతిభచాటినట్లు ఫౌండర్ కె.వెంకటేశ్ తెలిపారు. ఈ టోర్నీలో విద్యార్థి రామ్‌చరణ్ కటాస్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అభినందించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

రాజాపూర్: పల్లెప్రగతిలో భాగంగా మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి ఏడీఈ తార్యానాయక్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం వినతి పత్రం అందజేశారు. నాయకులు నరహరి, సత్యయ్య తదితరులు ఉన్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఖాజాపాష

జడ్చర్ల: పట్టణ కాంగ్రెస్ మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షుడిగా ఖాజాపాషను నియమించారు.అదేవిధంగా మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గంగాపూర్‌కు చెందిన ఖదీర్ నియమితులయ్యారు. వీరికి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రబ్బానీ సోమవారం నియామక పత్రాలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు కృష్ణ, మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జడ్చర్ల: స్థానిక పాతబజార్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో వచ్చే నెల 3న ప్రదర్శించనున్న శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం నాటకప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, సంగీత అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిబోయలను పట్టించుకోరా?

అడ్డాకుల: కులవృత్తి లేని వాల్మీకి బోయలను పాలకులు పట్టించుకోవడం లేదని మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ విమర్శించారు. మూసాపేట మండలం వేములలో సోమవారం ఇంటింటికీ వాల్మీకి మహర్షి కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. కుల వృత్తుల వారికి రూ.లక్షలు ప్రకటిస్తున్న ప్రభుత్వం తమ గురించి ఆలోచించడం లేదని వాపోయారు. తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న పాలకులు ఎస్టీ జాబితాలో చేర్చడంపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో వెంకట్రాములు, చెన్నకేశవులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.



రాజాపూర్: ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలను తీసుకుని లబ్ధిదారులు ఏదైన రంగంలో నిలదొక్కుకోవాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొప్పెరిబచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామానికి చెందిన బైండ్ల సుగుణమ్మకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకునేందుకు 100శాతం సబ్సిడీపై మంజూరైన రూ. 50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకట్‌రాములు, సూపరింటెండెంట్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ కళావతి, తదితరులు ఉన్నారు.

వీఓఏల ముందస్తు అరెస్టు



బాలానగర్: సమస్యలు పరిష్కరించాలని ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల పరిధిలోని 6 మంది వీవోఏలను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం స్వంత పూచీపై వదిలిపెట్టినట్లు బాలానగర్ ఎస్‌ఐ జయ ప్రసాద్ తెలిపారు.

మిడ్జిల్: మండలంలో వీఓఏలను ఎస్‌ఐ వెంకట్ రాములు తమ సిబ్బందితో కలిసి ముందస్తుగా అరెస్టు చేశారు. కాగా అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మండల అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. దేవమణి, సరిత, మంజుల, గీత, అంజమ్మ, శివలీల, భాగ్య తదితరులు ఉన్నారు.

మండలంగా ప్రకటించాలి



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని జేఏసీ కన్వీనర్ రాముణాయక్, కోకన్వీనర్ రాముణాయక్ అన్నారు. సోమవారం 129వ రోజు నిర్వహించిన రిలే దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిన్నచింతకుంట: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జీఎన్ దేవదానం డిమాండ్ చేశారు. పంచాయితీ కార్మికుల ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీఓ అనిల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చాలి చాలని వేతనాలతో దుర్భర జీవితం కొనసాగిస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలన్నాడు. కార్యక్రమంలో కొండన్న, కోళ్ల వెంకటన్న, కురుమన్న, బలరాం, చిన్నరాయుడు, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టుల అందజేత

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటేలో సత్తాచాటిన పలువురు విద్యార్థులకు వివిధ బెల్టులను సోమవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. తెలంగాణ స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ జపాన్ కరాటే అసోసియేషన్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో ఆలియాబేగం, ఎస్.శిరీష బ్లాక్‌బెల్టు ఫస్ట్‌డాన్, శశిరేఖ, విజయలక్ష్మి, స్వప్న బ్రౌన్ బెల్టు, సుష్మిత ఎల్లో బెల్టులు సాధించినట్లు వివరించారు.